

# టాటాల వారసురాలు

**మాయా** టాటా... వ్యాపార రంగ దిగ్గజం రతన్ టాటా సోదరుడి కూతురు. టాటాల వ్యాపార వారసత్వాన్ని ముందుకు తీసుకుపోయే వారిలో ఆమెనూ ఒకరిగా పరిగణిస్తున్నారు. 34 ఏండ్ల మాయా టాటా తల్లిదండ్రులు అలూ మిస్త్రీ, నోయెల్ టాటా. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బేయర్స్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ వార్విక్‌లో మాయ ఉన్నత విద్య అభ్యసించారు. ఇక ఆమె తల్లి అలూ మిస్త్రీ టాటా గ్రూప్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ తోబుట్టువు. అలా తల్లివైపు నుంచి కూడా మాయకు ఘనమైన వ్యాపార వారసత్వమే ఉందన్నమాట. నోయెల్ టాటా నేమో రతన్ టాటాకు సవతి సోదరుడు. వృత్తిపరంగా మాయ ప్రయాణం టాటా ఆపర్చునిటీస్ ఫండ్‌లో మొదలైంది. తర్వాత టాటా డిజిటల్‌కు మారారు. ఈ క్రమంలో టాటా న్యూ యాప్ రూపకల్పనలో ఆమె కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు టాటా మెడికల్ సెంటర్ ట్రస్ట్ బోర్డులో సభ్యురాలిగా ఉన్నారు. ఇందులో భాగంగా 2011లో రతన్ టాటా కోల్‌కతాలో ప్రారంభించిన క్యాన్సర్ హాస్పిటల్‌ను ఆమె పర్యవేక్షిస్తున్నారు. టాటాల వారసురాలిగా మాయ వ్యాపార రంగంలో భారతీయ మహిళల సత్తా ప్రపంచానికి చాటుతారని కోరుకుందాం.

నమస్తే తెలంగాణ
# జిందగీ
11
హైదరాబాద్ | శుక్రవారం 17 మే 2024 www.ntnews.com




# గురకకు గురి పెడదాం

పిల్లి కూతల్లా మొదలవుతుంది. పులి గాండ్రింపు రేంజ్‌కు చేరుకుంటుంది. ఎంత నిద్రలోకి జారుకుంటే అంత సౌండ్. ఈ ముచ్చటంతా గురక గురించే! గురక పెట్టేవారికి ఆపై ఎప్పటికో అనారోగ్య సమస్యలు వస్తాయేమో కానీ, ఆ శబ్దం భరించలేక ఎందరో నిద్రలేమితో బాధపడుతుంటారు. అధిక బరువు గురకకు ఒక కారణంగా చెబుతున్నారు. గురక సాధారణ సమస్యే అయినా.. అది కొందరికి ప్రమాదకరంగా మారే అవకాశం కూడా ఉందని నిపుణుల మాట. ఈ సమస్యను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు కూడా! చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే గురక నుంచి బయటపడొచ్చని సూచిస్తున్నారు.



- రాత్రిపూట పడుకునే ముందు వేడి నీళ్లలో కొన్ని చుక్కల యూకలిప్టస్ ఆయిల్ వేసుకుని ఆవిరిప డితే గురక సమస్య నుంచి రిలీఫ్ వస్తుంది.
- నిద్రకు ఉపక్రమించే ముందు గ్లాసు గోరువెచ్చని నీటిలో కొద్దిగా యాలకుల పొడి కలిపి తాగితే కూడా గురక క్రమంగా తగ్గుతుంది.
- ఒక చెంచా తేనెలో దాల్చినచెక్క పొడి కొద్దిగా కలిపి తీసుకోవడం వల్ల కూడా విపరీతమైన గురక నుంచి ఉపశమనం లభిస్తుంది.
- పడుకునే ముందు పెప్పర్‌మింట్ నూనెను చేతులకు రాసుకొని వాసన చూసినా గురక ఇబ్బంది తగ్గుతుంది.
- గురక ఎక్కువగా వచ్చే వాళ్లు వెల్లకిలా కాకుండా ఒక పక్కకు తిరిగి పడుకోవడం వల్ల తీవ్రత తగ్గుతుంది. మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉంటే వాటికి దూరంగా ఉండటం శ్రేయస్కరం.

# ఇస్మార్ట్ ఫోర్క్



**ఆహారం** పద్ధతిగా తింటేనే ఒంటబడుతుందని పెద్దల మాట. బాగా నమిలి తింటే మంచిదని కూడా చెబుతుంటారు. కానీ, అంత తీరిగ్గా కూర్చొని తినే సమయం పట్నవాసులకు ఎక్కడిది? ఓటీటీకి గంటల తరబడి అతుక్కుపోయినప్పుడు కనిపించని గడియారం.. తిండి దగ్గరికి వచ్చేసరికి టక్కున గుర్తొస్తుంటుంది. పైగా చేతితో తినే అలవాటూ తప్పిపోయింది. కంచంలో ఏం వడ్డించినా స్పూన్‌తో పైపైన టచ్ చేస్తూ.. మెరుపువేగంతో తినడం రివాజుగా మారింది. ఇలా వేగంగా తినేవాళ్లను అదుపు చేయడానికి పుట్టుకొచ్చింది ఈ స్మార్ట్ ఫోర్క్. దీన్ని ఉపయోగించినప్పుడు ఎంత వేగంగా తింటున్నామో ట్రాక్ చేయొచ్చు. నిమిషానికి ఎన్ని ముద్దలు హాంఫట్ చేశారో ఫోన్‌లో తెలియజేస్తుంది. మితిమీరిన వేగంతో తింటుంటే వైబ్రేట్ అవుతూ 'నిదానమే ప్రధానం' అని హెచ్చరిస్తుంది. ఏ పూటకాపూట ఎన్ని ముద్దలు, ఎంత వేగంగా తిన్నామో, ఎంత సమయం భోజనం చేశామో.. అన్నీ ఫోన్‌లో చూసుకోవచ్చు. లెక్క ఎక్కువైనా ఫర్వాలేదు టైమ్ తక్కువ కాకుండా చూసుకోమని సున్నితంగా హెచ్చరిస్తుందన్నమాట. భలేగా ఉంది కదా ఈ ఇస్మార్ట్ ఫోర్క్. ఫోర్క్స్‌తోపాటు స్మార్ట్ చెంచాలు లభ్యమవుతున్నాయి. ఆన్‌లైన్ అంగట్లో రకరకాల బ్రాండ్లకు చెందినవి అందుబాటులో ఉన్నాయి.




**మగువల నయనాల సొగసును కలువ రేకులతో పోలుస్తారు. ప్రస్తుతం ఆ కలువలు దుస్తుల మీదా, నగల్లోనూ ఒదిగిపోయి అతివల అలంకరణలో భాగమయ్యాయి. గులాబీ, ఆకుపచ్చ రంగుల మేళవింపుతో కెంపులు, పచ్చలను పొదిగిన కలువపూల నగలు సంప్రదాయ దుస్తులపైనా, ఆధునిక ఫ్యాషన్ మీదా చక్కగా ఒదిగిపోతున్నాయి. ఒకప్పుడు గుళ్లు, గోపురాలు, దేవుడి చిత్తరువుల్లో వికసించిన కలువలు ఇప్పుడు రకరకాల రూపాల్లో నగ నిగలు పెంచుతున్నాయి. భారీ డిజైన్లతో రూపొందే టెంపుల్ జువెలరీ నుంచి సన్నని గొలుసులతో మెరిపించే మినిమల్ ఆభరణాల వరకు అన్నింటా ఇవి విరబూస్తున్నాయి.**

# నగల రాణి.. కలువ పూబోణి!



**మహిళలు** ధరించే దుస్తుల్లోనే కాదు అలంకరించుకునే నగల్లోనూ ఎప్పటికప్పుడు ట్రెండ్ మారిపోతూ ఉంటుంది. మార్కెట్‌లో ఏ ఫ్యాషన్ కొనసాగుతున్నా.. కొన్ని నగలు మాత్రం ఎప్పుడూ ఆడపడచుల ఆదరణ పొందుతూనే ఉంటాయి. వాటిలో ముఖ్యంగా సంప్రదాయం, సంస్కృతి మేళవించిన ఆభరణాలు ముందువరుసలో ఉంటాయి. దేవతామూర్తుల ప్రతిబింబాలు, ఏనుగులు, మయూరాలు, ఆకులు, తీగలు, మామిడిపిందెలు.. ఇలా ఒక్కటేమిటి సృష్టి అందాలన్నీ మగువల మేనిపై నగల్లో ఒదిగిపోయి వాటి సొగసును రెట్టింపు చేసుకుంటాయి. గులాబీలు, కలువలు కూడా ఆభరణాల్లో అమరిపోతున్నాయి. అయితే వీటిలో కలువలు పొదిగిన నగలు ఎంతో ప్రత్యేకం. అలలు లేని కొలనులో ముచ్చట గొలిపే ఈ పుష్పాలను చూస్తూ ముదితలు మురిసిపోతారు. వారి మురిపాన్ని మరింత పెంపు చేసేలా కెంపులు, వజ్రాలు, పచ్చలను పొదిగి కలువల్ని రూపొందించిన నగలు ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నాయి.



**టెంపుల్** జువెలరీలో కలువలు పొదిగిన నగలు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిలో సన్నని గొలుసులు జోడించిన డిజైన్లూ అందుబాటులోకి వచ్చేశాయి. ఇవి ఆధునిక దుస్తులపైనా చక్కగా అమరిపోతూ అతివల అలంకరణలో భాగమవుతున్నాయి. కలువలను ప్రతిబింబించే కంఠాభరణాలు, పెండెంట్లు, బ్రేస్‌లెట్లు, గాజులు, కమ్మలు, ఉంగరాలు.. అన్నిరకాల ఆభరణాలు మార్కెట్లోకి వచ్చేశాయి. గుత్తపూసలు, ముత్యాలు జోడించిన ఈ నగలు అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంటున్నాయి. బంగారు ఆభరణాల్లోనే కాదు వెండితో తయారు చేసిన భారీ ఆభరణాలు, ఆదివాసీ నగల్లోనూ కలువల డిజైన్లు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. టెర్రకోట, ఫ్యాబ్రిక్, సిల్క్ జువెలరీలోనూ ఈ కలువల అందాలను జోడిస్తున్నారు తయారీదారులు. ఇంకెందుకు ఆలస్యం కలువ సోకులను మీరూ ఓసారి ట్రై చేసేయండి!







# ఈ గులాబీ.. గెలిచింది ప్రతిసారి!

**సోనీ టీవీ సూపర్‌స్టార్ సింగర్ సీజన్ 3 వేదికపైకి గులాబో సపేరా రావడంతోనే అందరూ నిలబడ్డారు. కరతాళ ధ్వనులతో ఆమెకు స్వాగతం పలికారు. అక్కడున్న వారంతా ఆమెను గొప్ప కళాకారిణిగానే కాదు అంతకుమించిన పోరాటంలో గెలిచినందుకు అంతెత్తున గౌరవించారు. ఇంట్లో లింగ వివక్షను, సమాజంలో కుల వివక్షను ఎదుర్కొని ఎదిగొచ్చిన సాహసి ఆమె. బొందలోంచి బయటపడి బతికింది. ఊరికి దూరంగా పెరిగింది. దేశం గర్వించే కాల్బేలియా నృత్య కళాకారిణిగా ఎదిగింది. బహిష్కరించిన ఊరే స్వాగతం పలికిన ఆ బిడ్డకు ఘన స్వాగతం ఈ రేంజ్‌లో ఉండాల్సిందే!**

**భూమిలో** పాతిపెట్టినా పోరాడి గెలిచిన ఒక బిడ్డ కథ ఇది. అది రాజస్థాన్, అజ్మీర్ ప్రాంతంలో కొత్రా గ్రామం. ఆ ఊరిలో పాములు ఆడిస్తూ బతికే కాల్బేలియా అనే సంచార జాతికి చెందిన ఓ కుటుంబం నివసించేది. ఆ ఇంట్లో ఓ రోజు ఒక ఆడపిల్ల పుట్టింది. బిడ్డ పుట్టినప్పుడు తండ్రి ఊళ్లో లేడు. పాములు ఆడించేందుకు సంచారానికి వెళ్లాడు. ఆ పిల్లను వదిలించుకోవాలని పుట్టిన కొన్ని గంటలకే గొయ్యి తీసి పసిగుడ్డును పూడ్చిపెట్టారు కొందరు ప్రబుద్ధులు. పోరాడి తెంచుకున్న పేగు తడి ఆరక ముందే ఈ సమాజంతో ఆ బిడ్డ యుద్ధం మొదలైంది. గోతిలో పాతిపెట్టినా గుక్కపట్టి ఏడుస్తూనే ఉంది. మట్టికింద ఏడు గంటలు బతికే ఉంది! ఆ ఏడుపు విన్న తల్లి కడుపు తరుక్కుపోయింది. బొందను తవ్వి బిడ్డను గుండెలకు హత్తుకుంది. కప్పెట్టిన మట్టిలో అడ్డుగా ఉన్న గడ్డి పరకలు ఆ బిడ్డ శ్వాస తీసుకోవడానికి సాయపడ్డాయి. కొన ఊపిరితో బయటపడ్డ ఆ చిన్నారి నృత్యమే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా ఎదిగింది.

**రోజులు** గడిచాయి. సంచారానికి వెళ్లిన తండ్రి ఇంటికి చేరుకున్నాడు. బిడ్డను ఎత్తుకొని ముద్దాడాడు. తన బిడ్డ విషయంలో ఇంట్లో వాళ్లు చేసిన దారుణం ఆయనకు అప్పటికింకా తెలియదు. ఓ రోజు ఆడబిడ్డను, మగబిడ్డను సమానంగా చూడాలని చెప్పే మనసున్న పెద్దలు ఆ తండ్రిని పంచాయితీకి పిలిచారు. ఆ పసికందు విషయంలో అతని కుటుంబం ఎంతటి దారుణానికి ఒడిగట్టిందో చెప్పారు. అందుకు శిక్ష అనుభవించాల్సిందే అన్నారు. గ్రామం నుంచి వెలివేశారు. పెద్దలు విధించిన బహిష్కార శిక్ష ఆ వెనుకబడిన కుటుంబానికి ఎలాంటి పరిష్కారం చూపలేకపోయింది.

### గులాబీ విరిసింది

జరిగిన తప్పునకు కుంచించుకుపోయింది ఆ కుటుంబం. బిడ్డకు ధన్వంత్రి అని పేరు పెట్టుకుంది. ఆ చిన్నారికి జబ్బు చేస్తే దవాఖానలో చేర్పించారు తల్లిదండ్రులు. మందులకు జబ్బు లొంగలేదు. వైద్యులు చేతులెత్తేశారు. ఆమె బతకాలని ఆశిస్తూ తన పక్కన ఒక గులాబీని ఉంచి పోయారు. చివరికి బతికింది. ఆ పువ్వుకు గుర్తుగా బిడ్డ పేరుని గులాబీగా మార్చాడు తండ్రి. ఊరికి దూరంగా పెరిగిన గులాబీకి పాములే స్నేహితులు. వాటిని ఆడించే నృత్యమే ఆమెకు ఆటపాటలు. గులాబీ వాళ్ల నాన్న పాములు ఆడించడానికి ఎక్కడికి వెళ్లినా కూతురును వెంట తీసుకెళ్లేవాడు. పుంగి ఊదుతూ పాములను ఆడించేవాడు. తండ్రిని నిశితంగా గమనిస్తూ ఆ వాద్యం ఊదడంలో పట్టుసాధించిందీ బిడ్డ. తండ్రి ఆడిస్తున్న పాములకు పోటీగా తనూ మెలికలు తిరిగేది. ఆ అనుభవమే తర్వాత కాల్బేలియా నృత్యంపై పట్టుకు కారణమైందంటారామె.



### పుష్కర్ మేళా సంబురాలు

గులాబీకి పదేండ్లు ఉన్నప్పుడు రాజస్థాన్‌లో పుష్కర్ మేళాకు హాజరయ్యింది. ఆ మేళాలో జానపద నృత్య కళాకారులకు ప్రదర్శన అవకాశం కల్పించారు. ఆ చిన్న అవకాశం ఆమె జీవితాన్ని మార్చేసింది. గులాబీ తొలి ప్రదర్శన చూసినవాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఆ ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగింది. చిన్నప్పటి నుంచి తమను అదోలా చూసేవాళ్లే తప్ప.. అభినందించే వాళ్లను ఆమె చూసి ఎరగదు. ఆ అభినందనలు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. నిమ్న కులమనే ఈసడింపులు పోయి.. నృత్య కళాకారిణిగా కొత్త గుర్తింపు వచ్చింది. పుష్కర్ మేళాలో మొదలైన ప్రయాణం మూడున్నర పుష్కరాలుగా అప్రతిహతంగా కొనసాగుతున్నది.

### పదహారేండ్లకు

చిన్న చిన్న గ్రామాలు తిరుగుతూ వీధుల్లో ప్రదర్శనలిచ్చే గులాబీ ప్రతిభను గుర్తించి పెద్ద పెద్ద సంస్థలు ఆహ్వానించడం మొదలుపెట్టాయి. 1980లో జైపూర్‌లో జరిగిన ప్రదర్శన ఆమె జీవితాన్ని మరింతగా మార్చేసింది. తమ సాంస్కృతిక కళారూపాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించే నృత్యకారిణి దొరికిందని రాజస్థాన్ పర్యాటక శాఖ అధికారులు గుర్తించారు. రాజస్థానీ సంస్కృతిని పరిచయం చేసేందుకు ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో ఆమె ప్రదర్శన తప్పనిసరి చేశారు. అయిదేండ్ల తర్వాత... వాషింగ్టన్ నగరంలో జరిగే ఒక ప్రదర్శనకు భారత్ తరఫున ప్రదర్శన ఇచ్చేందుకు గులాబీ ఎంపికైంది. అప్పుడు ఆమె వయసు పదహారేండ్లు! ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నది లేదు. కేవలం వీధి ప్రదర్శనలు, భిక్షాటనతో మొదలైన ఆమె నాట్యం అంతర్జాతీయ వేదికపై కొత్తపుంతలు తొక్కింది. భారతీయ పత్రికలు సపేరా బిడ్డ (పాములోళ్ల బిడ్డ) అమెరికాలో మన దేశం గర్వించేలా నృత్య ప్రదర్శన చేసిందని అభినందిస్తూ కథనాలు ప్రచురించాయి. ఆ సందర్భంలో ఓ విదేశీ పత్రిక గులాబీ ఇంటర్వ్యూ ప్రచురించింది. అందులో ఆమె పేరును గులాబోగా ప్రస్తావించింది. ఈ మార్పు గులాబీకీ నచ్చింది. తన పేరును గులాబోగా స్థిరం చేసుకుంది. అదే పేరుతో కాల్బేలియా నృత్యంలో మహారాణిగా ఎదిగింది.

> “ శాస్త్రీయ సంగీతంలో హార్మోనియం కళాకారుడిని వివాహమాడిన తర్వాత గులాబో వైవాహిక జీవితం జుగల్‌బందీగా సాగింది. తన కళకు ఎల్లలు లేవని చాటి చెబుతున్నది. డెన్మార్క్‌లో పాఠశాల నెలకొల్పి అక్కడివారికి కాల్బేలియా నృత్య శిక్షణ ఇస్తున్నది. జానపద నృత్య కళాకారిణిగా గులాబో ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం నాలుగో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీతో సత్కరించింది.

### పొమ్మన్న ఊరే రమ్మంది!

అమెరికా ప్రదర్శన తర్వాత గులాబో తిరిగి తన ఊరికి చేరింది. ఒకప్పుడు సపేరా కుటుంబాన్ని వెలివేసిన పెద్దమనుషులంతా వచ్చి ఆమెకు స్వాగతం పలికారు. ఆమెను అవమానించిన వాళ్లే... జయజయ ధ్వానాలు పలికారు. తమ పిల్లలకు కూడా ఈ నృత్యం నేర్పించమని అడిగారు. 'నీవు మా ఊరి బిడ్డవైనందుకు ఎంతో గర్విస్తున్నామ'ని కీర్తించారు. 'నా నృత్యం వివక్షను దూరం చేస్తుందని, ఊరిని దగ్గర చేస్తుందని, గ్రామ ప్రజలలో ఉండే భేదభావాలను తొలగిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. నేను నమ్మిన కళతో ఇది సాధ్యమైంది' అంటారు గులాబో. కాల్బేలియా నృత్యాన్ని తమ జాతివారికే కాకుండా ఇతరులకూ నేర్పించడం మొదలుపెట్టింది. అవసాన దశకు చేరుకున్న ఆ నృత్యరీతికి మళ్లీ జీవం పోసింది. ఎన్నో ప్రయోగాలు చేసి కొత్త రూపునిచ్చింది. జైపూర్‌లో 'గంగౌర్ ఘుమర్' డ్యాన్స్ అకాడమీని నెలకొల్పింది.

### కూడుపెట్టని కళ

డప్పు, తాళం, కంజరి, పుంగి వాద్యకారులతో కలిసి గులాబో చేసే నృత్య ప్రదర్శన ఆద్యంతమూ ఆసక్తిగా సాగుతుంది. పాదాలను బొంగరంలా తిప్పుతూ, దేహాన్ని అలవోకగా వంచుతూ చేసే విన్యాసాలు 'ఔరా!' అనిపిస్తాయి. ఎన్ని చేసినా ఈ కళ కడుపు నింపదంటుంది గులాబో. 'ఎంతో మంది కళాకారులు వేదికపై అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నారు. కానీ, వాళ్ల జీవితాలు మాత్రం దయనీయంగా ఉన్నాయ'ని అంటారామె. తన దగ్గర శిక్షణ తీసుకున్న కళాకారులకు గుర్తింపు వచ్చినంతగా ఆదాయం రావడం లేదని గమనించింది. నాట్యం నేర్పడమే కాదు, వాళ్ల ఆకలి తీర్చడమూ తన బాధ్యతగా స్వీకరించింది. యాభై ఏండ్ల వయసులో సాంకేతిక విషయాలు నేర్చుకొని, ఆన్‌లైన్‌లో నాట్య పాఠాలు చెబుతున్నది. అలా వచ్చిన ఆదాయాన్ని నిరుపేద కాల్బేలియా కళాకారులకు పంచుతున్నది.